వెనామీకి వైరస్ ముప్పు

- యాజమాన్య పద్ధతులు ముఖ్యం
- రైతులను హెచ్చరిస్తున్న శాస్త్రవేత్త
- మండల పరిధిలో 1,950 ఎకరాల్లో సాగు

ముత్తుకూరు: గతంలో రొయ్యల సాగు చాలా ఎక్కువగా ఉండేది. రకరకాల కారణాలతో నేడు ఆ సంఖ్య తగ్గింది. నాడు టైగర్ రొయ్యల పెంపకంతో ఆక్వా రైతులు లాభాలు చవిచూశారు. తర్వాతి కాలంలో వాటికి సోకిన జబ్బుల వల్ల తీవ్రంగా నష్టపోయారు. అనంతరం స్కాంపి రొయ్యల పెంపకం కూడా కొద్దిరోజులు లాభదాయకంగా మారినా ఎక్కువ కాలం ఉండలేదు. ప్రస్తుతం వెనామీ రొయ్యల పెంపకంలో కూడా ఆక్వా రైతులు సవాళ్లు ఎదుర్కొంటున్నారు. వివిధ జబ్బులకు గురవుతున్న రొయ్యలను కాపాడుకునేందుకు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

మండలంలో ఇలా..

ముత్తుకూరు మండలంలోని పొట్టెంపాడు, కృష్ణపట్నం, పోలంరాజుగుంట, బ్రహ్మదేవి, తాళ్లపూడి, ముత్తుకూరు, పంటపాళెం, మామిడిపూడి తదితర పంచాయతీల్లో సుమారు 1,950 ఎకరాల్లో రొయ్యల పెంపకం జరుగుతోంది. ప్రస్తుతం వైట్‌గట్, వైట్‌స్పాట్, విబ్రియోసిస్ వ్యాధులు అధికంగా ఉన్నాయి.


వైట్‌స్పాట్‌కు గురైన రొయ్య



వైట్‌గట్ సోకిన రొయ్యలు

యాజమాన్య పద్ధతులు పాటించాలి



వెనామీ రొయ్య చెరువులో 20 గ్రాముల వరకు చాలా త్వరగా పెరుగుతుంది. ఈ మూడు నెలలపాటు ఎటువంటి జబ్బులు రాకుండా రైతు జాగ్రత్తగా వ్యవహరించాలి. ముఖ్యంగా రొయ్యకు మేత యాజమాన్యం, నీటి యాజమాన్యం సక్రమంగా పాటిస్తే రొయ్యల పెంపకం విజయవంతమవుతుంది.

– డాక్టర్ ఆనందప్రసాద్ పాటూరి, సహాయ ఆచార్య, ఆక్వా కల్చర్ విభాగం, మత్స్య కళాశాల

వాతావరణం అనుకూలించాలి



రొయ్య విత్తనం నాణ్యత లోపించినా, వాతావరణం అనుకూలించకపోయినా జబ్బులు వ్యాపించే ప్రమాదం ఉంది. ప్రస్తుతం వైట్‌గట్ వైరస్ వ్యాపించింది. రైతులను తీవ్ర నష్టాలకు గురిచేస్తోంది. పక్కనున్న చెరువుకు ఈ వైరస్ సోకితే మన చెరువు రొయ్యలకు కూడా ముప్పు ఏర్పడుతుంది. నీటి యాజమాన్యం ముఖ్యం.

– పల్లంరెడ్డి జనార్దనరెడ్డి, రైతు, పొట్టెంపాడు

జబ్బులిలా..

ప్రస్తుతం వెనామీకి అనేక రకాల జబ్బులు సోకుతున్నాయి. వాటిల్లో తెల్లమచ్చల రోగం ఒకటి. ఈ వైట్‌స్పాట్ సిండ్రోమ్ వైరస్ వల్ల వారం రోజుల్లో చెరువులోని రొయ్యలు చనిపోతాయి. నాణ్యమైన సీడ్ (విత్తనం) ఎంపిక చేసుకోవడం తప్ప దీనికి నివారణ లేదు.

⇨ మరొకటి నల్లమొప్పల వ్యాధి. చెరువు అడుగు భాగం పాడైపోవడం వల్ల ఇది సోకుతుంది. చెరువులోని మట్టి నల్లగా మారుతుంది. కుళ్లిన కోడిగుడ్డు వాసన వస్తుంది. అడుగు భాగాన్ని కదిలించడం ద్వారా విషవాయువులు బయటకు వచ్చే అవకాశం ఉంది.

⇨ హెపటో పాంక్రియాటిక్ నెక్రోసిస్.. ఇది ప్రమాదకరమైన ఈ వైరస్. అధిక సంఖ్యలో రొయ్య పిల్లలను వదలడం, నీరు నాణ్యతగా లేకపోవడంతో వ్యాపిస్తుంది. ఫలితంగా రొయ్య ఆహారం తీసుకోదు. పెరుగుదల లోపిస్తుంది. నీటి నాణ్యతే ఆరోగ్యకరమైన ఆహారం. ఏరియేషన్ అందిస్తే జబ్బును అధిగమించవచ్చు.

⇨ తెల్ల మలం వ్యాధి.. వెనామీకి తరచుగా వచ్చే ఈ రోగం వల్ల రొయ్య పేగు తెల్లబడుతుంది. ఆహారం సరిగ్గా తీసుకోదు. పెరుగుదల లోపిస్తుంది. నీటి నాణ్యత యాజమాన్యాన్ని పటిష్టం చేయడం, ఆహారం మితంగా వాడటంతో రోగం తీవ్రత తగ్గించవచ్చు.

⇨ విబ్రియోసిస్.. విబ్రియో అనే బాక్టీరియా వల్ల ఈ జబ్బు వస్తుంది.

⇨ లూజ్ షెల్ రోగం.. కొన్ని రొయ్యలు గుల్లకొట్టలేకపోతాయి. ఫలితంగా గుల్లకు – రొయ్య శరీరానికి మధ్య ఖాళీ ఏర్పడుతుంది. నీటిలో తగినంత కాల్షియం లేకపోతే ఈ జబ్బు వ్యాపిస్తుంది. సున్నం కొట్టడం ద్వారా ఈ జబ్బును తగ్గించవచ్చు.

విద్యుత్ తీగలు చోరీ

పొదలకూరు: మండలంలోని కల్యాణపురం గ్రామ పొలాల్లో విద్యుత్ స్తంభాలకు ఉన్న తీగలను బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్టు రైతులు వెల్లడించారు. నాలుగు స్తంభాల వైరును కత్తిరించి ఎత్తుకెళ్లినట్టు పేర్కొన్నారు. ఈ మేరకు విద్యుత్ ఏఈ శ్రీకాంత్ దృష్టికి రైతులు తీసుకెళ్లారు. ఏఈ రైతులతో కలిసి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

అటకాయించి వ్యక్తిపై దాడి

పొదలకూరు: మాస్కులు ధరించిన గుర్తుతెలియని తొమ్మిది మంది యువకులు పొదలకూరు – సోమశిల మార్గంలో ఓ వ్యక్తిని అటకాయించి దాడి చేసి గాయపరిచిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. గురువారం స్థానికులు, పోలీసులు వివరాలు వెల్లడించారు. మండలంలోని మొగళ్లూరు గ్రామానికి చెందిన యనమల శ్రీనివాసులురెడ్డి పొదలకూరులో మెడికల్ షాపు నిర్వహిస్తున్నాడు. రోజూ గ్రామం నుంచి వచ్చి షాపు నిర్వహించి తిరిగి రాత్రి ఇంటికెళ్తుంటాడు. బుధవారం రాత్రి మోటార్‌బైక్‌పై ఊరికి బయలుదేరాడు. దారిలో వావింటపర్తి గ్రామానికి చెందిన పరిచయస్తుడు ఎస్.వెంకటేశ్వర్లును బైక్‌పై ఎక్కించుకున్నాడు. వనంతోపు – కనుపర్తి బ్రాంచిరోడ్డు మధ్యలో పొదలకూరు నుంచి మూడు బైక్‌లపై వచ్చిన తొమ్మిది మంది యువకులు అటకాయించి మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు. చేతికి వేసుకునే ఇనుప కడియంతో తలపై దాడి చేయడంతో శ్రీనివాసులురెడ్డికి గాయమైంది. ఆటో వస్తుండటంతో హెడ్‌లైట్ల వెలుతురులో గుర్తుపడతారని నిందితులు పొదలకూరు వైపు పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై ఎస్కే హనీఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన చుట్టుపక్కల గ్రామాల్లో చర్చనీయాంశంగా మారింది.

క్లుప్తంగా

పట్టభద్రులకు శిక్షణ



బుచ్చిరెడ్డిపాళెం : డిగ్రీ చేసిన వారికి మెప్మా ద్వారా శిక్షణ ఇస్తున్నట్లు మెప్మా సీఓ నర్మదా పేర్కొన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలో గురువారం జరిగిన మెప్మా పోర్టల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని, ప్రసంగించారు. ఆశా ఫౌండేషన్ ద్వారా నిరుద్యోగులకు ట్రైనింగ్ ఇచ్చి అప్రెంటీస్ అవకాశం ఇస్తామన్నారు. ఆన్‌లైన్ ఎంట్రీ విధానం ద్వారా 95 మంది నిరుద్యోగులు పాల్గొన్నట్లు ఆమె తెలిపారు. సమావేశంలో డీఈఓ సృజన, ఐపీ అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామికి హనుమంత సేవ



బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని రామకృష్ణ నగర్‌లో కొలువైన కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామి, అమ్మవార్లకు హనుమంత సేవ జరిపించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి హనుమంత వాహనంపై కొలువుదీర్చి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

టీబీముక్త్ పంచాయతీలుగా వెంకన్నపురం, బసవాయపాళెం


మాట్లాడుతున్న ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ

కొడవలూరు: ప్రధానమంత్రి టీబీముక్త్ పంచాయతీలుగా వెంకన్నపురం, బసవాయపాళెం గ్రామాలు ఎంపికయ్యాయని జిల్లా అదనపు డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ తెలిపారు. మండలంలోని ఆ రెండు గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించి టీబీ కేసుల వివరాలను సిబ్బందిని ద్వారా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన టీబీ పరీక్షలు చేయడం, చికిత్స అందించడం, బాధితులకు పోషకాహార నిమిత్తం నెలకు రూ.500 చొప్పున ఆరు నెలల పాటు జమచేయడం, మందులు వాడడం వంద శాతం పూర్తి చేసినందుకు రెండు గ్రామాలు ఎంపికయ్యాయని స్పష్టం చేశారు. ఆయన వెంట ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ అమర్‌నాథ్, ఏసీఎస్సార్ మెడికల్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగూర్ ఖాదర్‌వలీ, కొడవలూరు వైద్యాధికారి ఎం.రామకృష్ణ ఉన్నారు.

అక్రమాలకు తావులేని పాలన


ప్రశాంతిరెడ్డికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

బుచ్చిరెడ్డిపాళెం : నియోజకవర్గంలో అక్రమాలకు తావులేకుండా పాలన సాగిస్తున్నట్లు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలో జాతీయ రహదారి డివైడర్లపై చెట్లు నాటే కార్యక్రమంలో గురువారం ఆమె పాల్గొని మాట్లాడారు. మండలంలో లేఅవుట్లను వేస్తున్నవారు పరిసరాలను కూడా అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో తేజ డెవలపర్స్ ఎండీ శ్రీనివాసరెడ్డి, బుచ్చి చైర్‌పర్సన్ సుప్రజ, ఎంపీపీ మన్నేపల్లి శ్రీనివాసులు పాల్గొన్నారు.

పక్కాగా భూముల రీసర్వే

- జేసీ కార్తీక్

ముత్తుకూరు : భూముల రీసర్వేను పటిష్టంగా పక్కాగా జరపాలని జేసీ కె.కార్తీక్ అన్నారు. మండలంలోని పైనాపురం రెవెన్యూ గ్రామంలో నెలరోజులకుపైగా జరుగుతున్న భూముల రీసర్వేను గురువారం జేసీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎటువంటి నష్టం జరగకుండా సర్వేలో పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రెవెన్యూ ఉద్యోగులకు సూచించారు. రైతుల పట్టా భూములకు జారీ చేసిన నోటీసులు, హాజరు, సర్వే ప్రక్రియను ఆరాతీశారు. సముద్రం కోతకు గురైన పట్టా భూములను కూడా చూశారు. జేసీ వెంట తహసీల్దార్ శ్రీనివాసులు, డీఎస్ఎల్ఓ నాగశేఖర్, ఐఓఎస్ రఘురామరాజు, డీఐఓఎస్ రాము, ఆర్ఎస్‌డీటీ శ్రీనివాసులున్నారు.


సర్వేను పరిశీలిస్తున్న జేసీ కార్తీక్ తదితరులు

కమనీయం.. ఉదయకళేశ్వరుడి కల్యాణం

కొడవలూరు: గండవరంలో కొలువైన గంగా పార్వతి సమేత ఉదయకళేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని నేత్రపర్వంగా గురువారం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కానుకలను సమర్పించారు. వ్యాఖ్యాతగా బండారు తులసీ మల్లికార్జునశర్మ వ్యవహరించారు. కల్యాణాన్ని ఆలయ అర్చకుడు బండారు సుబ్రహ్మణ్యం జరిపారు. అనంతరం స్వామి, అమ్మవార్లు గజవాహనంపై దర్శనమిచ్చారు. తదుపరి గ్రామోత్సవాన్ని వైభవంగా జరిపారు. బ్రహ్మోత్సవ కమిటీ చైర్మన్ ఆలం మాలకొండయ్య, ఈఓ బండి శాంతయ్య పర్యవేక్షించారు.



జిల్లా జైల్లో న్యాయ విజ్ఞాన సదస్సు

వెంకటాచలం: మండలంలోని చెముడుగుంట సమీపంలో ఉన్న జిల్లా జైల్లో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి ఖైదీల యోగక్షేమాలు తెలుసుకున్నారు. భోజన వసతి, వైద్య సదుపాయాల గురించి వారితో మాట్లాడారు. ఖైదీల కేసు వివరాలను అడిగి లాయర్ లేనివాళ్లకు ఉచితంగా ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జడ్జి వాణి

పకడ్బందీగా 'పది' పరీక్షలు

- డీఈఓ బాలాజీరావు
- హైస్కూల్లో విద్యా ప్రమాణాలపై అసంతృప్తి

మనుబోలు: పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామని డీఈఓ బాలాజీరావు తెలిపారు. స్థానిక ఎమ్మార్సీని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది పరీక్షలను 33,400 మంది విద్యార్థులు హాజరవుతారని, 174 కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే ఓపెన్ పది పరీక్షల కోసం 24 కేంద్రాలు, ఇంటర్ కోసం 44 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మాస్ కాపీయింగ్ జరగకుండా పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలోని ఆరు సమస్యాత్మక పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం 174 మంది చీఫ్ ఆఫ్ ఎగ్జామినర్స్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్స్‌ను నియమించినట్లు వెల్లడించారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ

అసంతృప్తి

స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను డీఈఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు సక్రమంగా సమాధానం చెప్పలేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. మెరుగైన బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట ఎంఈఓ రమేష్ కుమార్, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ ఆదిశేషయ్య, డీఓ రమేష్‌రెడ్డి తదితరులున్నారు.

సంపద కేంద్రాల రాబడితోనే జీతాలు

- డీపీఓ శ్రీధర్‌రెడ్డి

కొడవలూరు : చెత్త నుంచి సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలని, భవిష్యత్తులో పంచాయతీ సిబ్బంది వేతనాలు కూడా తద్వారా వచ్చిన రాబడితోనే చెల్లించాల్సి ఉంటుందని జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో గురువారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటి నుంచే తడి, పొడి చెత్తను వేరు చేసేలా గ్రామస్తుల్లో అవగాహన పెంచాలన్నారు. ప్రతి కేంద్రంలో వానపాముల ఎరువులను తయారు చేసి విక్రయాలు జరపాలన్నారు. కేంద్రాలను వినియోగంలోకి తేకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తే తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా ఇంటి పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వంద శాతం పన్నుల వసూలు లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ ఏవీ సుబ్బారావు, ఈఓపీఆర్డీ సాయి ప్రసాద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీపీఓ శ్రీధర్‌రెడ్డి

పక్కాగా ఇంటర్ పరీక్షలు

నెల్లూరు (టౌన్): ఇంటర్ పరీక్షలను పక్కాగా నిర్వహించాలని ఆర్ఐఓ ఆదూరు శ్రీనివాసులు పేర్కొన్నారు. స్టోన్‌హౌస్‌పేటలోని తన కార్యాలయంలో ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని వసతులను కల్పించాలని సూచించారు. జంబ్లింగ్ విధానంలో పరీక్షలను నిర్వహించనున్నామని పేర్కొన్నారు. కేంద్రాల్లోని అన్ని గదుల్లో సీసీ కెమెరాలను బిగించాలని, పరిసరాల్లో 144 సెక్షన్‌ను అమలు చేయనున్నామని వివరించారు. పరీక్ష కమిటీ జిల్లా సభ్యులు దీన్‌దయాళ్, వేణుగోపాల్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మొద్దు : జేసీ

తోటపల్లిగూడూరు: రైతులు దళారుల నమ్మి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి లబ్ధి పొందాలని జేసీ కార్తీక్ సూచించారు. మండలంలోని పేడూరు సొసైటీ పరిధిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని గురువారం జేసీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కనీస మద్దతు ధర అందించేందుకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ప్రస్తుతం గ్రేడ్ – ఏ రకం పుట్టికి రూ.19,720ల మద్దతు ధర ప్రకటించిందన్నారు. స్థానిక రైతు సంఘ నాయకులు జేసీని కలిసి ధాన్యం కొనుగోలు విషయంలో ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా సహకారశాఖాధికారి గురప్ప, సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ అధికారి అంకయ్య, తహసీల్దార్ కృష్ణప్రసాద్, డీటీ శివయ్య, పేడూరు సొసైటీ సీఈఓ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ కార్తీక్

కనుల పండువగా శివరాత్రి ఉత్సవాలు


మనుబోలు : శివపార్వతుల కల్యాణ మహోత్సవం

పొదలకూరు: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పొదలకూరు కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవారు బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం ఉదయం వరకు నంది వాహనంపై ఊరేగారు. పొదలకూరు రైతు సంఘం ఉభయకర్తగా వ్యవహరించింది.

⇨ గురువారం సాయంత్రం పురవీధుల్లో అర్చకులు గిన్నె భిక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. పొదలకూరు మండల బ్రాహ్మణ సేవా సంఘం ఉభయకర్తగా వ్యవహరించింది. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం నాయకులు పీబీఎస్ ప్రసాద్‌స్వామి, ఎం.రాజశేఖర్, గోపాలకృష్ణమాచార్యులు, కృష్ణమూర్తి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

⇨ ఆలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తామని ప్రధాన అర్చకుడు ప్రసాద్‌స్వామి తెలిపారు. ఉభయకర్తగా ఆర్యవైశ్య సంఘం వ్యవహరిస్తుందన్నారు. మధ్యాహ్నం అన్నదానం చేస్తారన్నారు.

పోటెత్తిన భక్తులు

⇨ **ముత్తుకూరు:** మహా శివరాత్రి సందర్భంగా జాగారం చేసిన భక్తులు గురువారం కృష్ణపట్నం సముద్ర తీరంలో పుణ్యస్నానాలు ఆచరించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచే కాకుండా నెల్లూరు నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. దీంతో ఈ మార్గం కిక్కిరిసిపోయింది. వేకువజామునే చేరుకున్న అనేకమంది ఇసుకలో శివలింగాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు.

శివపార్వతుల కల్యాణోత్సవం

⇨ **మనుబోలు:** శివరాత్రిని పురస్కరించుకుని మనుబోలులోని భగవాన్ వెంకయ్య స్వామి మందిర ఆవరణలోని విశ్వనాథస్వామి ఆలయ సన్నిధిలో శివపార్వతుల కల్యాణోత్సవాన్ని బుధవారం అర్ధరాత్రి వైభవంగా నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసులు శివపార్వతులకు సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. మంగళవాయిద్యాల నడుమ వేదపండితులు స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. గుండుబోయిన వెంకయ్య, మేకల యోగేశ్వరరావు కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. లింగోద్భవ అభిషేకానికి మేకల యోగేశ్వరావు ఉభయకర్తగా ఉన్నారు. అన్నదానం నిర్వహించారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు.

⇨ కండలేరు ఒడ్డునున్న సంగమేశ్వరాలయంలో శివపార్వతుల కల్యాణోత్సవం అనంతరం నూతన దంపతులను బుధవారం రాత్రి భక్తులు భుజాలపై మోసుకుంటూ మనుబోలు శివాలయానికి తీసుకొచ్చారు.

⇨ **కొడవలూరు:** మండలంలోని గండవరంలో ఉదయకళేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు నార్తురాజుపాళేనికి చెందిన కల్పవృక్ష సొసైటీ ఆధ్వర్యంలో ఆలయం వద్ద గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షురాలు ఎస్.సునీత మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు ఇబ్బంది పడకుండా ఏటా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సొసైటీ ప్రధాన్య కార్యదర్శి శ్రీలక్ష్మి, సభ్యులు జ్యోతి, అన్వర్, రాజు పాల్గొన్నారు.

జనసంద్రం

⇨ **తోటపల్లిగూడూరు:** ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కాటేపల్లి సాగర తీరానికి జనం పోటెత్తారు. శివరాత్రి సందర్భంగా కామాక్షి సమేత చంద్రశేఖరస్వామి ఆలయానికి బుధవారం రాత్రి భక్తులు వేలాదిగా తరలివచ్చి జాగారం చేశారు. గురువారం వేకువజామున సముద్ర స్నానాలు చేశారు. అనంతరం ఆలయానికి చేరుకున్న భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఎస్సై వీరేంద్రబాబు తన పోలీస్ సిబ్బందితో బందోబస్తును ఏర్పాటు చేశారు.


పొదలకూరు: నంది వాహనంపై..


ముత్తుకూరు: కృష్ణపట్నం సముద్ర తీరంలో భక్తులు


పొదలకూరు: పురవీధుల్లో ఊరేగింపు


కొడవలూరు: గండవరంలో అన్నదానం


మనుబోలు : వేడుకగా సాగుతున్న గ్రామోత్సవం


టీపీగూడూరు: కాటేపల్లి తీరంలో..